క్లుప్తంగా

సేవాలాల్ భక్తుల ప్రచారం



ప్రచారంలో సేవాలాల్ భక్తులు

జన్నారం: మండలంలోని కవ్వాల్, హాస్టల్ తండా గ్రామాల్లో శ్రీ సేవాలాల్ మహరాజ్ దీక్షాపరులు బంజార సంస్కృతి సంప్రదాయాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సేవాలాల్ మహరాజ్ భోగబండారో కార్యక్రమం చేపట్టారు. బంజార యువజన సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ.. సేవాలాల్ గొప్పతనం, బంజార సంస్కృతి, సంప్రదాయాలను వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జగదాంబ భక్తురాలు లక్ష్మీబాయి, జగదాంబ సేవాలాల్ పూజారి అమర్‌సింగ్ నాయక్, బంజార సేవాసంఘం నాయకులు సందేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలి



విద్యార్థుల కరాటే విన్యాసం

మంచిర్యాలక్రైం: విద్యార్థులు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకునేందుకు క్రీడలు, కల్చరల్ యాక్టివిటీస్ ఎంతో ఉపయోగ పడుతాయని రిటైర్డ్ పోలీస్ అధికారి గౌతంరావ్ అన్నారు. స్థానిక కాలేజీరోడ్‌లోని హ్యాపీ స్కాలర్ స్కూల్ 21సంవత్సరాల స్కూల్ కార్నివాల్ కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యతో పాటు క్రీడా రంగాల్లోనూ రాణించాలన్నారు. అనంతరం స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు, నాటికలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ విక్రమ్‌రావ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న వాసవీ కపుల్స్ సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల వాసవీ కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మంచిర్యాల జననీ వాలంటరీ బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించారు.
వాసవీక్లబ్ అంతర్జాతీయ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రీ, వాసవీ కపుల్స్ క్లబ్ కోశాధికారి కొడిత్యాల శివప్రసాద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో అధిక సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ రీజినల్ చైర్మన్ రవీందర్, కార్యదర్శి శ్రీధర్, కేబినెట్ కార్యదర్శి శ్రీనివాస్, వాసవీ కపుల్స్ క్లబ్ అధ్యక్షుడు అయిత శ్రీనివాస్, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి వెంకట శివప్రసాద్, సభ్యులు శ్రీనివాస్, అశోక్‌కుమార్, హరిప్రసాద్, శ్రీపతి, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : పులి

కాగజ్‌నగర్
వెంకటరమణ : పులి

– ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	60
దోసకాయ	40
చామగడ్డ	80
వంకాయ	30
బీరకాయ	60
కాకరకాయ	50
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సోరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	40
క్యాబేజ్	40

-ఆసిఫాబాద్‌అర్బన్



నేలకొరిగిన పెద్ద వృక్షం

అభయారణ్యం.. కళా విహీనం!



నరికిన చెట్టు మొదలు

- అడవికి గొడ్డలి పోటు
- కరువైన పర్యవేక్షణ



రహదారికి అతి సమీపంలోనే పడి ఉన్న వృక్షాలు

కెరమెరి: మొక్కలు నాటి వనాలు పెంచాలని, పర్యావరణాన్ని కాపాడాలని ప్రభుత్వం ప్రతీఏడాది హరితహారం పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటే, మరోవైపు అడవులను కాపాడాల్సిన అటవీ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా అడవిలోని వృక్షాలు నేలకొరుగుతున్నాయి. అక్రమార్కులు యథేచ్ఛగా పెద్ద చెట్లను నరికి వనాలను సర్వనాశనం చేస్తున్నారు. మండలంలోని పరంధోళి ఘాట్ రోడ్డుకు ఆనుకునే ఈ తతంగం కొద్ది నెలలుగా జరుగుతున్నా అటవీ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడడం లేదు. అనేక చెట్లను ఎడాపెడా నరికివేయడంతో వనం అందవిహీనంగా మారుతోంది. పరంధోళి ఘాట్ రోడ్డుకు అతి సమీపంలోనే చెట్లు నరికి వేస్తున్నారు. దట్టమైన అరణ్యంగా మారే అడవిని గుర్తు తెలియని వ్యక్తులు నరికివేయడం చట్టవిరుద్ధమని స్థానికులు పేర్కొంటున్నారు.

రక్షణ ఏది..?

ఒక చెట్టు పెరగాలంటే ఎంతో శ్రమపడాలి. వాటి సంరక్షణకు ఎంతో కష్టపడాలి. అప్పుడే ఆ మొక్క వృక్షమవుతుంది. అలాంటి చెట్లను యథేచ్ఛగా నరికేస్తుంటే అటవీ సిబ్బంది ఏం చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. అడవులను నరికేస్తుంటే అటవీ అధికారులు అటువైపు వెళ్లలేదా? వెళ్తే చెట్ల సంరక్షణకు ఎందుకు చర్యలు చేపట్టలేదని ప్రశ్నిస్తున్నారు. చెట్లకు జియో ట్యాగింగ్ చేసి రక్షణ కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్న మాటల్లో వాస్తవం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అటవీ అధికారులు స్పందించి అడవుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

గ్రామాభివృద్ధికి పాటు పడాలి



బియ్యం పంపిణీ చేస్తున్న సీఐ, ఎస్సై

దహెగాం: గ్రామస్తులు, యువకులు ఐక్యంగా ఉండి గ్రామాభివృద్ధికి పాటుపడాలని కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు అన్నారు. ఆదివారం జిల్లా ఎస్పీ సురేష్ కుమార్, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌ల ఆదేశాల మేరకు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మండలంలోని మారుమూల గ్రామం శంకరాపురంలోని 15 కుటుంబాలకు నిత్యవసర సరుకులు, బియ్యం, యువతకు వాలీబాల్ కిట్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడవుల్లోని వన్యప్రాణులను వేటాడొద్దని సూచించారు. విద్యుత్ తీగలు అమరిస్తే పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.
యువకులు చెడు వ్యసనాలు వీడాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దని సూచించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సనత్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీడ్కోలు హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థులు

పాతమంచిర్యాల: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని ఉన్నతంగా రాణించాలని రీజినల్ ఇన్‌చార్జి రాజు, పాఠశాల హెచ్‌ఎం జోబిన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఆదివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు బాల్య దశ నుంచే మంచి అలవాట్లు అలవర్చుకుని, సన్మార్గంలో నడవాలని సూచించారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్లు శ్రీవిద్య, లక్ష్మణ్‌రావు, కో ఆర్డినేటర్ శివకోటేశ్వర్‌రావు, డీన్ గజానంద్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. నిరుపయోగంగా నీటి ట్యాంకు



కెరమెరి: మండలంలోని పాటగూడ గ్రామంలో 2019లో రూ.12 లక్షల నిధులతో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు నిరుపయోగంగా మారింది. నిర్మించి నాలుగేళ్లు గడుస్తున్నా అధికారులు వినియోగంలోకి తీసుకురాలేదు. ఫలితంగా గ్రామస్తులకు మంచినీటి కష్టాలు తప్పడం లేదు. అధికారులు తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : విశ్వేశ్వర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ
ఫోన్ నంబర్ : 7995660688

ఘనంగా పెద్ద పోచమ్మ బోనాల ఉత్సవాలు



బోనాలతో మహిళలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో పెద్ద పోచమ్మ బోనాల ఉత్సవాలను పట్టణ ప్రజలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక రాంనగర్‌లో, 20, 21, 32వార్డులకు చెందిన భక్తులు పోచమ్మ దేవాలయం వద్దకు శోభాయాత్రగా వెళ్లి మేకలను, కోళ్లను వధించి మొక్కులు చెల్లించారు. అనంతరం ప్రత్యేక దర్శనం చేసుకున్నారు.

ఘనంగా సత్యసాయి ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సత్యసాయి సేవా సదన్ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం ఓంకారం కార్యక్రమం ప్రారంభించారు. కన్వీనర్ తణుకు దత్తాత్రి సేవాసదన్‌లో పతాకాన్ని ఆవిష్కరించారు. నగర సంకీర్తన అనంతరం పలువురు దంపతులతో హారతి కర్పూర హోమం నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి జిల్లా కన్వీనర్ జనార్దన్ సత్యసాయి సందేశాన్ని చదివి వినిపించారు. మధ్యాహ్నం నారాయణ సేవ నిర్వహించారు. సాయంత్రం భక్తులు సామూహిక భజన చేశారు. అర్చకులు గురువయ్య, కమిటీ ప్రతినిధులు తాటికొండ లక్ష్మయ్య, కొలిప్యాక దత్తాత్రి, సొన్నాయిల శంకర్, రావుల పాండురంగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివాజీ విగ్రహావిష్కరణ



నివాళులర్పిస్తున్న నాయకులు

బెజ్జూర్: మండలంలోని పోతేపల్లి గ్రామంలో ఆదివారం శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆరె కులస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ శివాజీ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డోకే రోజారమణి, సర్పంచ్ అంజలి, ఆరెకుల సంక్షేమ సంఘం రాష్ట్ర సభ్యులు వెంకన్న, నానయ్య, సంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు డోకే వెంకన్న, యూత్ అధ్యక్షుడు మహేష్, ప్రజలు పాల్గొన్నారు.

పగలు హాట్.. రాత్రి కూల్



ఎండ నుంచి ఉపశమనానికి శీతలపానీయాలు తాగుతున్న ప్రజలు

- ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలు
- పగలు ఎండతో ఇబ్బందులు
- వణికిస్తున్న రాత్రి చలి

వారం రోజులుగా ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)	గరిష్ఠం	కనిష్ఠం
మంగళవారం	35	19
బుధవారం	31	19
గురువారం	35	15
శుక్రవారం	34	17
శనివారం	36	18
ఆదివారం	37	20

పెంచికల్‌పేట్: వాతావరణంలోని పెను మార్పులతో మండల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పగలంతా ఎండ, రాత్రి చలితో ఇబ్బందులు పడుతున్నారు. మార్చి ప్రారంభంలోనే పగటి పూట అత్యధిక ఉష్ణోగ్రతలు, రాత్రి కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో వృద్ధులు, చిన్నపిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారు. సీజన్ ప్రారంభంలోనే వాతావరణం వేడెక్కిపోతుండటంతో రానున్న రోజుల్లో మరింత అవస్థలు తప్పవని ఆందోళన చెందుతున్నారు.

ఆరోగ్యంపై ప్రభావం..

మారిన వాతావరణ పరిస్థితులతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. పగలంతా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఎండల తీవ్రత పెరిగింది. మరోవైపు రాత్రిపూట చల్లని వాతావరణంతో పిల్లలు శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారు. విభిన్న వాతావరణ పరిస్థితులతో చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. శ్వాస,చర్మ సంబంధిత వ్యాధులతో పాటు జ్వరాలతో బాధపడుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

ఎండల తీవ్రత పెరుగుతున్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. ఎండలకు చిన్నపిల్లలు, వృద్ధులు, వ్యవసాయ కూలీలు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది. మధ్యాహ్నం లోగా పనులు పూర్తయ్యేలా చూసుకోవాలి. ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి.
– డా. అమన్, పీహెచ్‌సీ, పెంచికల్‌పేట్

యువత క్రీడల్లో రాణించాలి



పోటీలు ప్రారంభిస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

కౌటాల: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని కౌటాల ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని బోదంపల్లి గ్రామంలో స్థానిక యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువకుల్లో క్రీడా నైపుణ్యాలు ఉన్నాయని, వాటిని వెలికి తీసేందుకు క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. యువత చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజ సేవలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దుర్గం మోతిరాం, నాయకులు బుర్స నాగయ్య, దేవయ్య, నర్సయ్య, జగదీష్, రాజన్న, నిర్వాహకులు సతీష్, శ్రీకాంత్, ప్రశాంత్, అమర్‌నాథ్, సంజీవ్, వినోత్, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ పంపిణీ



వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై వెంకటేశ్

కెరమెరి: మండలంలోని చిన్నసాకడ గ్రామానికి చెందిన యువతకు ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో ఎస్సై నల్లా వెంకటేశ్ వాలీబాల్ కిట్ అందించారు. ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలన్నారు. యువత సన్మార్గంలో నడిచి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. సమాజంలో ఉన్నత వ్యక్తులుగా పేరు తెచ్చుకోవాలని తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెందోర్ మోతిరాం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెందోర్ ఆనంద్‌రావు, ఏఎస్సై ఉల్లాస్, కానిస్టేబుల్ ఫ్రేంసింగ్ తదితరులు ఉన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా గణేశ్



తిరుపతికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన ఈదులవాడ గణేశ్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా కొడగంటి తిరుపతిలు నియమితులయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్ వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొర్రి శ్రీనివాస్, రాజు, బ్రిజేశ్ గుప్తా, డాక్టర్ శ్రీకాంత్, చింటూ పాల్గొన్నారు.

పొలం బాట పట్టిన ఎంపీపీ



అరకపట్టిన ఎంపీపీ పెందోర్ మోతిరాం

నిధులు లేక, చేసిన పనులకు బిల్లులు రాక, ప్రతీ నెల రావాల్సిన వేతనం అందక ఇబ్బందులు పడుతున్న కెరమెరి ఎంపీపీ పెందోర్ మోతిరాం పొలం బాట పట్టారు. ఉదయం, సాయంత్రం పొలం పనుల్లో నిమగ్నమవుతున్నారు. తనకున్న మూడు ఎకరాల్లో మొక్కజొన్న, గోధుమ, నువ్వులు, పెసర, శనగ పంటలు సాగు చేస్తున్నారు. – కెరమెరి



శనగపంటలో గడ్డి తొలగిస్తున్న ఎంపీపీ